సామెతకథలు

# అంతా మన మంచికే

- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

పూర్వం గజపురాన్ని ఏలే రాజు వద్ద ఒక మంత్రి ఉండేవాడు. తన నెవరు ఏ విషయము అడిగినా అంతా మన మంచికే అంటూ ఉండేవాడు. ఒకసారి రాజుగారు యుద్ధవిద్యలలో నైపుణ్యము మెరుగు పరచుకోడానికై కత్తితో సాధనచేస్తుండగా, ప్రమాదవశాత్తూ అతని చిటికెన వ్రేలు తెగి నేలపై పడింది. ఈ విషయము మంత్రిగారికి చెప్పినపుడు 'అంతా మన మంచికే' అనడం రాజును ఆగ్రహానికి గురిచేసింది. వెంటనే రాజుగారు "మీ మాట ఋజువు అయ్యేవరకు కారాగారములో ఉండవలసినదని" ఆజ్ఞ జారీ చేసారు. మంత్రిగారు ఏ మాత్రమూ విచారము లేకుండా "మహాప్రసాదం - అది కూడా మన మంచికే" అన్నారు. భటులు మంత్రిగారిని చెరసాలలో బంధించారు.

కొన్నాళ్ళకు రాజుగారు వేటనిమిత్తము అడవికి పోయారు. ఈ సందర్భములో భటులాతనిని వెంబడించలేక, వెనుక బడి చివరకు దారి తప్పారు. రాజుగారు కొంతసేపు వేటాడి, అలసి ఓ చెట్టునీడన విశ్రమించారు. మంత్ర శక్తుల కొరకై , ఆరోగ్యవంతుడైన ఓ రాజును బలినీయదలచి, ఓ మాంత్రికుడు ఆ పరిసరములలో తిరుగాడుతూ రాజుగారిని చూడడం తటస్థించినది. వెంటనే ఆ మాంత్రికుడు మాయోపాయముచే రాజుగారిని తన కోటకు తీసుకొనిపోయి, ఆతనిని బలి యిచ్చుటకు సిద్ధము చేస్తుండగా, రాజుగారి చిటికెన వేలు లేని లోపము బయటపడింది. వికలాంగుడైన రాజు బలినిచ్చుటకు అనర్హుడు అని నిర్ణయించుకొని ఆ మాంత్రికుడు రాజుగారిని తిరిగి అడవిలో వదలివైచెను. బ్రతుకుజీవుడా! అని రాజుగారు కోటను చేరుకొనెను.

మరునాడు రాజుగారు సభను ఏర్పాటుచేసి, మాంత్రికుడు అతనిని తీసుకొని పోయిన వైనం, తిరిగి అడవిలో వదలివేయడం అంతా పూసగుచ్చినట్లు తెలియజేసారు. తనను బలి ఇవ్వడానికి తీసికొనిపోయి ఏల వదలివేసెనని సభికులను అడుగగా, అంగవైకల్యము ఉండడము కారణముగా అతనిని బలి యివ్వలేదని కొంతమంది వివరించారు. విషయము తెలుసుకున్న రాజుగారు మంత్రి మాటలు జ్ఞప్తికి రాగా, వెంటనే మంత్రిని విడిపించి, నిండు సభలో అతనిని సన్మానించి, క్షమించమని అర్థించారు. వెంటనే "అయ్యా! మంత్రివర్యా! నా వ్రేలు తెగడం నా మంచికే జరిగిందని ఋజువైంది. కాని తమరు కారాగారమున ఉండడము వలన జరిగిన మేలు ఏమిటి?" అని సూటిగా ప్రశ్నించారు రాజుగారు. కాస్తంతైనా తడుముకోకుండా మంత్రి "అయ్యా! ఆనాడు మీరు నన్ను కారాగారములో పెట్టించకపోయి ఉంటే, నేను మిమ్ములను వెంటాడి ఉండేవాడిని. మీకు మారుగా ఆ మాంత్రికుడు నన్ను బలి యిచ్చి ఉండేవాడు" అని చెప్పేసరికి, సభ కరతాళ ధ్వనులతో మారుమోగి పోయింది. రాజుగారు మంత్రిని

కౌగిలించుకొని, "అంతా మన మంచికే" అంటూ అతనిని మునుపటి కంటే వేయి రెట్లు ఎక్కువగా గౌరవించ నారంభించారు. మంత్రిగారి మాట అక్షర సత్యమని రాజుగారు వేనోళ్ళ కొనియాడారు.

## ఏ గూటి చిలుక ఆ గూటి పలుకే!

కొండవీడు నందు కొంతకాలము క్రిందట ఒక చిలుకకు రెండు పిల్లలు పుట్టాయి. చిలుక మేతకు వెళ్ళిన అదను చూచి ఓ దొంగ చిలుక పిల్లల్ని సంగ్రహించాడు. వాటిని తీసుకొని పోతూండగా అందొక చిలుక అదృష్టవశాత్తు తప్పించుకొని ఒక మునీశ్వరుని పర్ణశాల చేరుకొంది. మునీశ్వరుని పెంపకంలో అచ్చటి వాతావరణం వల్ల ఆ చిలుకలో కొంత మార్పు చెందినది.

ఒకనాడు మహారాజు వేటకైవచ్చి లేడిని పట్టుకొను తమకమున చాలసేపు గుఱ్ఱమును పరుగెత్తిస్తూ అలసి పోయాడు. విశ్రాంతికోసం చూస్తుండగా దొంగ కాపురం ఉన్న కుటీరం కన్పించింది. దానిని రాజు సమీపిస్తుండగా ఆ ఇంటనున్న చిలుక "దొరా! ఎవ్వడో యువకుడు గుఱ్ఱముపై వస్తున్నాడు. పట్టి కొట్టి దోచుకో" అని అరచింది. అప్పటికే అలసియున్న రాజు గుఱ్ఱాన్ని ప్రక్కదారి పట్టించి ఒక పర్ణశాలకు చేరుకున్నాడు.

పర్ణశాల దగ్గర దిగగానే మహాత్మా! మీ వంటి రాజుల రాక మా పూర్వజన్మ సుకృతము వల్లనే జరుగుతుంది. మిమ్ము చూస్తే అలసినట్లున్నారు. ఇచ్చటి మధుర ఫలాలనారగించండి. అచ్చట మధుర జలాలు సేవించండి. కొంత దనుక ఈ వృక్షచ్ఛాయను విశ్రమించండి. పిల్ల గాడ్పులచే మీ అలసట మటుమాయమౌతుంది" అని చిలుక పలికెను. ఆ చిలుక వినయ విధేయతలు మంజుల వాగ్ధోరణి రాజును ఆశ్చర్య చకితుణ్ణిగా, ధైర్యవంతునిగా చేసాయి.

తన చిలుక పలుకులు విన్న ముని లోనుండి వచ్చి అతిధి నాహ్వానించాడు. ముని ఆహ్వానము స్వీకరిస్తూ రాజు జరిగినదంతా మునికి తెలిపాడు. మునివల్ల ఆ చిలుకల గూర్చి తెలుసుకొన్నాడు. వెంటనే రాజు "ఏవాడ చిలుక ఆవాడ పలుకే" పలుకు తుందికదా! అన్నాడు. కాలక్రమంలో దీనినే "ఏ గూటి చిలుక ఆ గూటి పలుకే" యని కూడా వ్యవహారం ఏర్పడింది.

(అసలు కథకు కొన్ని మార్పులు చేసి ప్రచురించడం జరిగింది.)

*** *** ***

"Nonviolence is the greatest force at the disposal of mankind. It is mightier than the mightiest weapon of destruction devised by the ingenuity of man."
–Mohandas K. Gandhi.